ప్రజాశక్తి
గురువారం 26 డిసెంబర్ 2024 5 అనంతపురం

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో శాంతక్లాజ్ వేషధారణలో చిన్నారులు

క్రీస్తుస్మరణ..!

- జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శాంతిసందేశం విన్పించిన పాస్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం

కరుణామయుడైన ఏసు క్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ క్రీస్తుస్మరణ మారుమోగింది. చర్చిల్లో స్టార్లు కాంతులీనాయి. క్రిస్టయన్లు ప్రత్యేక ప్రార్థనలతో మురిసిపోయాయి. జిల్లా అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. క్రిస్టియన్లు నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు, శాంతిసందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. చాలా చర్చిల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా కేంద్రలోని సప్తగిరి సర్కిల్‌లోని సిఎస్ఐ చర్చి, అరవిందనగర్‌లోని ఎస్ఐసియు చర్చి, నాయక్ నగర్‌లోని అగాపే కల్వరి చర్చి, రామచంద్ర నగర్‌లోని మేరీ చర్చిలు క్రిస్టియన్లతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతపురంలో చర్చిలో క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

సిపిఎం అనంతపురం జిల్లా నూతన కార్యదర్శి వర్గం

ఓ.నల్లప్ప,
సిపిఎం జిల్లా కార్యదర్శి.

కార్యదర్శివర్గం

వి.రాంభూపాల్

బాలరంగయ్య

వి.సావిత్రి

ఎస్.నాగేంద్రకుమార్

బి.శ్రీనివాసులు

వి.రామిరెడ్డి

ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

కృష్ణమూర్తి

సాగు, వ్యవసాయ సమస్యలపై దృష్టి

సిపిఎం 14వ జిల్లా మహాసభల సందర్భంగా ఎన్నికైన ఆ పార్టీ నూతన జిల్లా కమిటీ సభ్యులు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్
- సిపిఎం జిల్లా మహాసభల విజయవంతంపై కృతజ్ఞతలు
- నూతన జిల్లా కమిటీ ఎన్నిక
- కార్యదర్శిగా ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ప్రధానమైన సమస్యలుగా ఉన్న సాగు,వ్యవసాయంపై దృష్టి సారించి భవిష్యత్తు పోరాటాలకు సమాయత్తం అవనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సోమ,మంగళవారం రెండు రోజులపాటు అనంతపురంలో జరిగిన సిపిఎం 14వ జిల్లా మహాసభలో చర్చించిన అంశాలపై పలు విషయాలను వెల్లడించారు. మహాసభ విజయవంతంగా నిర్వహించుకోవడానికి అవసరమైన సహకారం తోడ్పాటు అందించిన వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రెండు రోజుల్లో జరిగిన చర్చల సారాంశాన్ని తెలియజేశారు. మహాసభల వేదికగా గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకున్నట్లు తెలిపారు. అదే సమయంలో రాబోయే మూడేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాలను రూపొందించినట్టు తెలిపారు. వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న అనంతలో వ్యవసాయం, సాగునీరు ప్రధానమైనవని చెప్పారు. ఈ రెండు రంగాలపై దృష్టి సారించి రాబోయే రోజుల్లో పోరాటాలు రూపొందించాలని మహాసభలో నిర్ణయించినట్టు తెలిపారు. హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ వంటి వాటిని ప్రభుత్వాలు పూర్తి చేయడానికి ఒత్తిడి పెంచాల్సి ఉందన్నారు. ఆ దిశగా కొత్త కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ మహాసభలో మొత్తం 11 అంశాలపై తీర్మానాలు చేసినట్టు తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటం
సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం పోరాటాలు సాగిస్తుందని ఆ పార్టీ నూతన జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప తెలిపారు. కార్యదర్శిగా ఎన్నికైన తరువాత ఆయన మీడియాతో బుధవారం మాట్లాడారు. మహాసభ విజయవంతం చేయడంలో కృషి చేసిన అందరికీ ముందుగా ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాలో ముందుతరం కమ్యూనిస్టులు నెలకొల్పిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, వి.రామిరెడ్డి, కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఓ.నల్లప్ప

మహాసభల సందర్భంగా సిపిఎం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఓ.నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులుగా వి.రాంభూపాల్, సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, ఆర్.రామిరెడ్డి, కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఆర్‌వి.నాయుడు, వై.వెంకటనారాయణ, నాగమణి, నిర్మల, శకుంతల, టి.రామాంజినేయులు, బి.మల్లికార్జున, కె.భాస్కర్, అచ్యుత ప్రసాద్, జి.జగన్మోహన్‌రెడ్డి, ఎం.మారుతీ ప్రసాద్, ముర్తుజా, ఓతూరు పరమేష్, సాకె.నాగరాజు, కసాపురం రమేష్, కెస్ఎల్, కో ఆప్షన్‌ను ఎన్నుకున్నారు.

శ్రీ బాలాజీ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గం జీసస్ నగర్‌లో శ్రీబాలాజీ హోటల్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. హోటల్ అభివృద్ధి చెందాలని యజమాని దివాకర్‌కు తెలియజేస్తూ ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు, సైపుల్లాబేగ్, జయరాం నాయక్, సురేష్, రమణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శ్రీబాలాజీ హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అంబిక

ముదురుతున్న వివాదం..!

- గ్రీన్ టెక్ ఆర్ఎంసి ప్లాంట్ వద్ద ఉద్రిక్తత
- రక్షణ కోరుతూ 100కు మేనేజర్ ఫోన్

గ్రీన్‌టెక్ ఆర్ఎంసి ప్లాంట్ వద్ద పోలీసుల గస్తీ

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ సమీపంలోని ఆర్ఎంసి ప్లాంట్ విషయంలో ప్రజా ప్రతినిధుల మధ్య కోల్డ్ వార్ జరుగుతుంది. వారం రోజుల క్రితం గ్రీన్ టెక్ ఆర్ఎంసి ప్లాంట్‌కు సంబంధించిన మూడు టిప్పర్లను అధిక బరువుతో వెళు తున్నాయని కారణంతో అధికారులు సీజ్ చేసి అపరాధ రుసుం విధించారు. ఈ విషయంలో ఇద్దరు ముఖ్య ప్రజా ప్రతినిధులు మధ్య వివాదం ముదురుతోంది. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కంకర టిప్పర్లు గ్రీన్‌టెక్ ఆర్ఎంసి ప్లాంట్‌కు వస్తోంది. ఈ విషయంపై కొందరు గ్రీన్‌టెక్ ఆర్ఎంసి పరిశ్రమ వద్ద అడ్డగించే ప్రయత్నం చేస్తున్నారని, రాత్రిళ్లు పరిశ్రమ ప్రధాన గేటుకు అడ్డుగా మంచాలు వేసుకుని టిప్పర్లను రాకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆ పరిశ్రమ మేనేజర్ అశోక్ 100కు సమాచారం అందించారు. తమ వాహనాలను ధ్వంసం చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన కియా ఇండస్ట్రియల్ ఇన్‌ఛార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు గ్రీన్ టెక్ పరిశ్రమ వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. పరిశ్రమ చుట్టుపక్కల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైసిపి వారనే అడ్డగింత..?

వైసిపికి చెందిన టిప్పర్ల ద్వారా గ్రీన్‌టెక్ పరిశ్రమకు కంకర తరలిస్తున్నారని కొందరు అధికారపార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో ఆ టిప్పర్లను అడ్డుకుంటున్నారని చెప్పుకొస్తున్నారు. నిబంధనలో మేరకే టిప్పర్ల ద్వారా కంకర పరిశ్రమకు తీసుకొస్తున్నామని ఇలా అడ్డగించి భయభ్రాంతులకు గురి చేయడం సబబు కాదని ఆ పరిశ్రమ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇద్దరు ప్రజా ప్రతినిధుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందనే వాదనలు బలంగా విన్పిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికార పార్టీ పెద్దలు చొరవ చూపాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

నార్పలలో ఇన్‌ఛార్జిల పాలన..!

పూర్తిస్థాయిలో అందని సేవలు.. ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు

ప్రజాశక్తి-నార్పల

మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌ఛార్జి అధికారుల పాలన సాగుతోంది. ఏ శాఖలోనైనా ఏ అధికారి బదిలీ అయినా లేదా దీర్ఘకాలిక సెలవులో వెళ్లినా ఆ స్థానంలో మరో అధికారి వచ్చే పరిస్థితులు కనపడడం లేదు. దీంతో ఇన్‌ఛార్జి అధికారులే దిక్కయ్యరని, దీంతో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని మండల రైతులు, ప్రజలు పేర్కొంటున్నారు. వివరాలు.. ఏడాది క్రితం వ్యక్తిగత కారణాలతో విద్యుత్ ఏఈ రఘునాథ్‌బాబు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆ స్థానంలో అనంతపురం లోని ఏడిఈ రఘును ఇన్‌ఛార్జి ఏఈగా నియమించారు. ఈయన ఎప్పుడు నార్పలకు వస్తారో ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. దీంతో వ్యవసాయ తోటలకు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నా, ఏదైనా విద్యుత్ సమస్య ఎదురైనా ఎవరిని కలవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఇక పప్పూరు వెటర్నరీ వైద్యశాలలో డాక్టర్ రాధిక కొద్ది రోజుల క్రితం ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నార్పల వెటర్నరీ డాక్టర్‌ను పప్పూరుకు ఇన్‌ఛార్జిగా నియమించారు. నార్పల వెటర్నరీ డాక్టర్‌కు పప్పూరు వైద్యశాలతో పాటు బుక్కరాయసముద్రం, కొర్రపాడు వైద్యశాల ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. దీంతో ఈయన ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని, పాడి పశువులు, గొర్రెలు, మేకలకు ఏ ఇబ్బంది వచ్చినా నానా అవస్థలు పడుతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రెండేళ్ల క్రితం నార్పల ఉద్యాన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఫాజిలున్నీసాబేగం ఏడీగా ఉద్యోగోన్నతిపై వెళ్లగా బుక్కరాయసముద్రం ఉద్యాన అధికారి శైలజను నార్పల మండల ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పండ్ల తోటల్లో ఏ సమస్య వచ్చినా మండల ఉద్యాన అధికారి అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఉద్యాన రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఉన్నతాధికారులు ప్రత్యేక దష్టి సారించి ఆయా శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల రైతులు, పాడి రైతులు, ఉద్యాన రైతులు కోరుతున్నారు.

ఉద్యానవన అధికారి కార్యాలయం

సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోవాలి : ఎమ్మెల్యే

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ పరిశీలకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో ఇప్పటికి కొందరు నాయకులు వెనుకపడ్డారని, వారు మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ సభ్యత్వ నమోదు గురించి అధిష్టానం అన్ని విషయాలను పరిశీలిస్తోందని, లక్ష్యాన్ని చేరుకునేలా ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు, పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ టిడిపి నాయకులు పాల్గొన్నారు

గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

కార్పొరేట్ల కోసం విద్యుత్ ప్రయివేటీకరణ

- కేంద్రం తీరు అత్యంత దుర్మార్గం
- చండీఘడ్ విద్యుత్ కార్మికుల పోరాటం అజేయం
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అదానీ కార్పొరేట్ సంస్థల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ విద్యుత్‌ను పూర్తిగా ప్రయివేటీకరణ చేసి ప్రజలపై భారాలు మోపేందుకు సిద్ధం అవుతున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రయివేటీకరణను నిరసిస్తూ చండీఘడ్ విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంభిస్తోందన్నారు. విద్యుత్ రంగంపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడి ప్రత్యక్షంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. చండీఘడ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కంలను ఇప్పటికే ప్రయివేటీకరణ చేసే ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రయివేటీకరణ చర్యలు మరింత వేగవంతం అయ్యాయన్నారు. పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లను గంపగుత్తగా అవుసోర్సింగ్ చేయమని ఆదేశాలు జారీ అయ్యాయంటే కేంద్రం విద్యుత్‌ను ఏ విధంగా ప్రయివేటీకరణ చేస్తోందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రజా సొమ్మును అక్రమ మార్గంలో అదానీకి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ చేస్తున్న విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా చండీఘడ్, ఉత్తరప్రదేశ్ విద్యుత్ కార్మికులు ఈ పోరాటంలో అగ్రభాగాన ఉన్నారు తెలిపారు. ఈ పోరాటాలకు సిఐటియు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి కార్పొరేట్ విధానాలు కాకుండా ప్రజా అనుకూల విధానాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ముత్తుజా, వెంకట్ నారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మధు, సిఐటియు నాయకులు మన్నీల రామాంజనేయులు, లతీఫ్, బండారి ఎర్రిస్వామి, బిహెచ్.రాయుడు, ఆజంబాషా, నాగరాజు, రామాంజనేయులు, శివ, చౌడప్ప పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో క్రిస్మస్ ట్రీలు, స్టార్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. బైబిల్ సందేశాన్ని వినిపించారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. యువత పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సర్వమానవాళికి శాంతి సందేశాన్ని ఇచ్చిన యుగకర్త యేసు క్రీస్తు అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ ఎస్‌బిఐ, జీసెస్ నగర్‌లోని హెర్మోన్, సిఎస్‌ఐ ట్రినిటీ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ కర్తవ్యం, ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగాలను అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంఘ తేజస్విని, ఆర్యవైశ్య సంఘం నాయకుడు తాటి మధు పాల్గొన్నారు.

అనంతపురం : రూరల్ మండలంలోని రాచానపల్లి గ్రామంలో ఉన్న ఏసుకృపా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ కాపరి జి.నవీన్ కుమార్ అధ్యక్షతన వ్యవసాయశాఖ నాగరాజు, సిస్టర్ లీనా దేబోరా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెవరెండ్ డాక్టర్ ఎవిఆర్.జార్జ్ జీసెస్, బైబిల్ సందేశాన్ని వినిపించారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ రెడ్డి వారి సౌహార్ద నాగరాజు పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సండే స్కూల్‌లో చిన్నారులు చేసిన నృత్య, నాటిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బ్రదర్ బైటస్, జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పాస్టర్ జాషువా, జహంగీర్, పాస్టర్ రూఫస్‌కుమార్, ఏసు కృపా మందిర సంఘ సభ్యులు, సిస్టర్ లీనా దేబోరా పాల్గొన్నారు.

సాయివిజ్ఞాన పాఠశాలలో...

అనంతపురం నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రిన్సిపల్ జి.లావణ్యరామ్, ఉపాధ్యాయ బృందం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు మేరీమాత, ఫాదర్ జోసెఫ్, శాంటాక్లాజ్, ఏంజిల్, గొర్రెల కాపరులు, తదితర వేషధారణలో అలరించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని సిఅండ్‌ఐజిఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సురేంద్ర బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రేమ సందేశం అనుసరణీయం అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్ చేసి చర్చి కమిటీ అధ్యక్షులు చల్లా రాజశేఖర్ చౌదరికి తినిపించారు. అలాగే టీచర్లు భాస్కర్, శాంతి సహకారంతో సుమారు వంద మంది పేద మహిళలకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. చర్చిలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకల్లో పాస్టర్స్ డిఎస్ పాల్, జఖయ్య, సంఘ నాయకులు రోజీ రాజేష్, ఆర్లప్‌బాబు, జోసెఫ్ కిశోర్, రవికుమార్, సునీల్, జ్ఞాన, బిర్యానీ రఘు, డాక్టర్ దేశం శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నాయకులు మల్లికార్జున, తెలుగు యువత నాయకులు అనిల్‌చౌదరి, శర్మాస్, డిష్ మురళి, అమర రామ్మోహన్, మల్లిపల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాచానపల్లిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ నాగరాజు

ఏసుక్రీస్తు ప్రేమకు ప్రతిరూపం : అదనపు ఎస్పీ

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో చేపట్టిన వేడుకలకు ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసు ఆదర్శాలను స్ఫూర్తిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, చర్చి ఫాదర్ వినోద్‌కుమార్, ఆర్ఐలు రాముడు, బాబు, పోలీసు అధికారుల సంఘం కార్యదర్శులు జాఫర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, నాగరాజు, మసూద్ వలీ, పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, హరేసముద్రం,

కళ్యాణదుర్గంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శ్రీధర్‌ఘట్ట, గోనేహాల్, సింగేపల్లి, కొలగాన హల్లి, శ్రీరంగాపురం, కురవల్లి, బొల్లనగుడ్డం, కల్లుహోల, గోవిందవాడ, దర్గాహొన్నూరు, ఎలంజి, తదితర గ్రామాల్లోని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు, గీతాలాపనలు నిర్వహించారు. పాస్టర్లు జీసస్ జన్మ వృత్తాంతం, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు వారి ఇళ్ల వద్ద క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు ఏర్పాటు చేసి రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆత్మకూరు : మండలంలోని పి.యాలేరు, వై.కొత్తపల్లి గ్రామ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు కేట్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా చర్చిలకు కుల మతాలకు అతీతంగా వెళ్లి ప్రార్ధనలు చేశారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు శశాంక్‌బాబు, అంకె ఆనంద్, వెంకటేష్, రాజారమేష్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : నార్పలలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో పయనించాలని అతిథులు సూచించారు. పాస్టర్లు జీసస్ జీవిత చరిత్ర, జన్మ ఇతివృత్తాంతం గురించి వివరించారు. బైబిల్ సందేశాన్ని వినిపించారు. చర్చిల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్లూరు, గూడూరు, కడవకల్లు, తదితర గ్రామాలలో క్రైస్తవులు చర్చిల్లో క్యాండిల్స్ వెలిగించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పుట్లూరులో ప్రభుదాసుబాబు మంగళవారం అర్ధ రాత్రి నుంచి ప్రత్యేత ప్రార్ధనలు చేశారు. జీసస్, బైబిల్ సందేశాన్ని వినిపించారు.

పెద్దవడుగూరు : ప్రతి ఒక్కరూ క్రీస్తుబోధనలను అనుసరించి నడుచుకోవాలని స్థానిక ఐఎన్‌సి చర్చి పాస్టర్ జాన్ డేవిడ్ సూచించారు. చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఏసుక్రీస్తు జననం, బోధనలు, బైబిల్ సందేశాన్ని వినిపించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే క్రిష్టిపాడు, దిమ్మగుడి, చిన్నవడుగూరు, కొండూరు, రావులుడికి, లక్ష్మంపల్లి, గుత్తిఅనంతపురం, తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూరులో క్రిస్మస్ కేట్ కట్ తినిపిస్తున్న టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు

పెద్దవడుగూరులో క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న పాస్టర్ జాన్‌డేవిడ్

అనంతపురంలోని సాయివిజ్ఞాన పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

నేరాలు ఘోరాలు

వాటర్ ప్లాంట్‌లోకి దూసుకెళ్లిన లారీని పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

వాటర్ ప్లాంట్‌లోకి దూసుకెళ్లిన లారీ.. యువకుడు మృతి.. మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లోకి బుధవారం రాత్రి లారీ దూసుకెళ్లడంతో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కె.సురేష్ తెలిపిన వివరాలు... మండలంలోని యంగన్నపల్లి గ్రామానికి చెందిన భాస్కర్, లక్ష్మణ్ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగించేవారు. ఆ క్రమంలో తొండపాడు గ్రామంలో వాటర్ ప్లాంట్ పక్కన నూతన గృహ నిర్మాణ పనులకు వెళ్లారు. గుత్తి వైపు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఓ లారీ అతి వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో భాస్కర్, లక్ష్మణ్ నీళ్లు తాగి అక్కడే నిల్చొని ఉండగా లారీ వారిపై నుంచి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో భాస్కర్ మృతి చెందగా లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. లారీ ప్లాంట్లోకి దూసుకెళ్లడంతో ఇంజిన్ ఆయిల్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్, క్లీనర్ లారీలో నుంచి దూకి నీటితో మంటలను ఆర్పి పారిపోయారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ కె.సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు లారీ డ్రైవర్, క్లీనర్ కోసం గాలింపుచర్యలు చేపట్టారు. లారీ డ్రైవర్, క్లీనర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

మృతి చెందిన భాస్కర్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మగట్ట మండలంలోని జె.వెంకటం పల్లి గ్రామానికి చెందిన యువకుడు అభిలాష్ బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేసేందుకు విద్యుత్ మోటార్‌ను వేసి నీటిని వదులుతుండగా అకస్మాత్తుగా షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడి తండ్రి శివయ్య హుటాహుటిన అభిలాష్‌ను ఆటోలో రాయదుర్గం తీసుకొస్తుండగా బిటిపి రోడ్డులో రైల్వే గేటు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ హనుమంతరాయుడు, శివయ్య, ప్రయాణికుడు వన్నూరుస్వామి తీవ్రంగా గాయపడ్డారు. దీంత వారిని మరో ఆటోలో రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అభిలాష్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన వారికి చికిత్స చేస్తున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభిలాష్(ఫైల్‌ఫొటో)

వంతెన పైనుంచి కింద పడి వ్యక్తి..

ప్రజాశక్తి-పామిడి

మద్యం మత్తులో వంతెనపై నుంచి కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కూలి పని చేసుకుని జీవనం సాగించే దూదేకుల బాషా(40) మంగళవారం రాత్రి గ్రామం వెలుపల ఉన్న ఒ వంతెనపై కూర్చుని మద్యం తాగుడు. ఆ మత్తులో వంతెనపై నుంచి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. వారు సమాచారం ఇవ్వడంతో పామిడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతిచెందిన దూదేకుల బాషా

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో సద్దాం హుస్సేన్ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మండలంలోని హనుమిరెడ్డిపల్లి బ్రహ్మయ్య గుడి సమీపంలో చోటు చేసుకుంది.. ఎస్ఐ శివ తెలిపిన వివరాలు.. సద్దాం హుస్సేన్ బైక్‌పై కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్తుండగా హనుమిరెడ్డిపల్లి సమీపంలో బీహార్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ పులేంద్ర అతివేగంతో వచ్చి ఢీకొన్నాడు. దీంతో సద్దాం హుస్సేన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన 108 సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇమామ్ హుస్సేన్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రేపు 'మట్టి మట్టి' పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రముఖ రైతుకవి దర్భశయనం శ్రీనివాసాచార్య వెలువరించిన "మట్టి మట్టి" వ్యవసాయ కవిత్వ సంపుటి పుస్తక పరిచయ సభ శుక్రవారం జరగనుంది. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాలులో తెలుగు శాఖ సౌజన్యంతో ఉదయం 10:30 గంటలకు "స్పందన" అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, బండి నారాయణస్వామి గౌరవ అతిథులుగా పాల్గొంటారన్నారు. ప్రముఖ విమర్శకులు తూముచర్ల రాజారామ్ పుస్తకాన్ని విశ్లేషిస్తారన్నారు. అనంతరం వ్యవసాయ కవితల పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. పుస్తకపరిచయ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సిఐ శివగంగాధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్‌సిసి మిత్రులు

సిఐ శివగంగాధర్‌రెడ్డికి మిత్రుల సన్మానం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివగంగాధర్‌రెడ్డిని 2002-05 బ్యాచ్ ఎన్‌సిసి మిత్రులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎపి, తెలంగాణ, కర్నాటకలో స్థిరపడిన బాల్య మిత్రులు 19 ఏళ్ల తర్వాత కలవడంపై సిఐ శివగంగాధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మిత్రులందరూ ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. సిఐ మాట్లాడుతూ నా మిత్రులు వివిధ రాష్ట్రాల్లో స్థిరపడి అందరూ తాడిపత్రికి వచ్చి కలవడం సంతోషకరమన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న మాట్లాడుతూ ఆలోచనలు, భావాలను పంచుకోవడం వల్ల వారిలో ఉన్న మానసిక సమస్యలను దూరం చేసుకోవచ్చు అని తెలిపారు. టీచర్ రమేష్‌నాయక్, జావీద్ మాట్లాడుతూ స్నేహం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో రఘుబాబు, డోన్ మహేష్, రసూల్, ఆర్.మహేష్, జాకీర్, మనోహర్, రామకృష్ణ, షెక్షావలి, రంగస్వామి, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని సలకంచెరువు, తరిమెల గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. ఆర్‌డిఎక్స్ పథకం కింద ప్రత్యేక బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున గురువారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

రేషన్ డీలర్ల మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని చౌక దుకాణం డీలర్లు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేసి, ప్రజల మన్ననలు పొందాలని మండల చౌక దుకాణం డీలర్ల సంఘం గౌరవాధ్యక్షులు బండి కిష్టప్ప తెలిపారు. పట్టణంలోని ఎఫ్‌సిఐ గోదాములో బుధవారం మండలంలోని డీలర్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎన్.బండి కిష్టప్పను ఘనంగా సత్కరించారు. కిష్టప్ప మాట్లాడుతూ డీలర్లు సమిష్టిగా ఉంటూ కార్డుదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పట్టణంతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 51 చౌక దుకాణాల డీలర్లు సమావేశంలో పాల్గొన్నారు. మండల అధ్యక్షులుగా దాసరి సత్య నారాయణ, ఉపాధ్యక్షులుగా ఉమామహేశ్వర, కార్యదర్శిగా పసుపులేటి వెంకటేశులు, ఉప కార్యదర్శిగా తిరుమలేష్, సభ్యులుగా మహేష్, ఆనంద్, తిమ్మయ్య, తిప్పేస్వామినాయక్‌లను ఎన్నుకున్నారు.

డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్పను సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

విద్యుత్ భారాలపై రేపు వైసిపి నిరసన ర్యాలీ

జయప్రదం చేయాలని నగర మేయర్ వసీం పిలుపు

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను నిరసిస్తూ ఈ నెల 27వ తేదీ నగరంలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలపై ఎలాంటి విద్యుత్ భారాలు వేయమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే రూ. 15వేల కోట్ల భారం వేయడం ఏంటని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్‌తో పాటు పలు ఎన్నికల హామీలను సైతం విస్మరించారన్నారు. వాటిపై ప్రశ్నిస్తే దాడులు, దౌర్జన్యాలు, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలను గాలికి వదిలేశాడన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి అధినేత జగన్ ప్రజల పక్షాన ఈ నెల 27వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగా శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని పాతురు బ్రహ్మంగారి గుడి నుంచి పవర్ ఆఫీస్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామని, అందులో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన, మోసపూరిత పాలన కొనసాగుతోందని విమర్శిం చారు. సిఎం చంద్రబాబుకు మొదటి నుంచి మేనిఫెస్టో అంటే గౌరవం లేదని టిష్యూ పేపర్ లా వాడుకున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి నేడు అమలు చేస్తున్నారని విమర్శించారు. మైనార్టీ విభా గం జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్ మాట్లాడుతూ నమ్మించి మోసం చేయ డం చంద్రబాబు నైజమని, 6 నెలల పాలనలో ఏ ఒక్క హామీని అమలు చేయకపోవ డమే ఇందుకు నిదర్శన మన్నారు. ప్రజలు వైసిపి పాలనకు, కూటమి పాలనకు తేడా గమనించాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు, సోనీ రమణ, ఇసాక్, రహంతుల్లా, శ్రీనివాసులు, రాజేశ్వరి, నాయకులు చింతకుంట మధు, కిషోర్, హబీబుల్లా, రవి, దాదా ఖలందర్, గఫూర్, షెక్షావలి, రియాజ్, రఫీ, హుస్సేన్ పీరా, అన్సర్, ఖాదర్, జావీద్, శోభా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ మహమ్మద్ వసీం

వైసిపి నిరసన పోస్టర్లు విడుదల

అంతపురం : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాప్తాడులో విద్యుత్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి ఏఈకి వినతి పత్రం ఇస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచి సిఎం చంద్రబాబు మాట తప్పారన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు కట్టకిందపల్లి నారాయణరెడ్డి, అమర్నాథరెడ్డి, హరిప్రసాద్రెడ్డి పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులు దహనం

మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘం జెఎసి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మను ధర్మం కాదు సమతా రాజ్యం రావాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కాంక్షించారు. మానవ జీవన విధానంలో మనువాదం దుర్మార్గమైందన్నారు. మను ధర్మాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు సాటి మనిషిని మనిషిగా చూడలేని మను స్మృతి నశించి పోవాలని మను స్మృతి ప్రతులను దహనం చేశారు. సాకే హరి మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి శూద్రులు, అతిశూద్రులని సమాజం నుంచి వేరు చేసి అణచివేస్తూ అంటరానివారుగా చూడడం దారుణమ న్నారు. అభివృద్ధి, చైతన్యా నికి ఆమడ దూరంలోకి నెట్టివేస్తూ అధిక జనాభా కలిగిన బహుజన ప్రజలను పరిపాలిస్తున్నారని వాపోయారు. దేశంలో పశువులకు ఉన్న ప్రాధాన్యత, గౌరవం మనుషులకు లేకుండా పోవడం బాధాకరమన్నారు. మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే బహుజనులకు చదువు నేర్పాలనుకుంటే వారి మీద పేడ, బురద వేయిస్తూ భౌతిక దాడులు చేశారన్నారు. బిఆర్ అంబేద్కర్ చదువుకునేం దుకు వెళ్లగా అవమానాలకు గురిచేసింది మను స్మృతే అన్నారు. మూఢత్వం, ఆచారాలు పేరుతో శ్రమ లేకుండా సంపన్నులుగా చెలాయించడం మనువాదులకే దక్కుతోందన్నారు. భారత రాజ్యాంగమే దేశ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృ త్వాన్ని అందించగలదని తెలిపారు. కార్యక్రమంలో చెలిమప్ప, దొన తిమ్మప్ప, సూగేపల్లి నారాయణ, గోపాల్, చెన్నమల్ల, గంగన్న, రామకృష్ణ, ఈశ్వరయ్య, వెంకటేష్, దివ్య పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలిగా వి.నిర్మల

ప్రజాశక్తి-గుత్తి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలిగా పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన వి.నిర్మల ఎన్నికయ్యారు. ఆమె సిపిఎం గుత్తి మండల కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో అనంతపురంలో జరిగిన సిపిఎం 14వ జిల్లా మహాసభల్లో వి.నిర్మలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలుగా రెండోసారి ఎన్నుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని వి.నిర్మల తెలిపారు.

అల్పాహారం అందిస్తున్న సెయింట్‌పాల్ స్కూల్ యాజమాన్యం

పేదలకు అల్పాహారం, నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని జెమ్స్ సంస్థ ఆధ్వర్యంలో సెయింట్‌పాల్ స్కూల్ యాజమాన్యం ఆలూరు రోడ్ సిఐటియు కాలనీ వద్ద క్రిస్మస్ పండుగను పరస్కరించుకుని అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెమ్స్ క్రిస్టియానిటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ స్టీఫెన్ జోసెఫ్ మాట్లాడుతూ ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా తమవంతుగా పేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. సెయింట్ పాల్ స్కూల్ ఆవరణలో వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసి, పేదలకు బట్టలు, ఇంటి సామగ్రిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసి శేఖర్, సామెల్, సుసన్, సిమెన్స్, హెడ్రిక్ రాజ్ కుమార్, ఉదయ్ కుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, ఎస్‌కెఎం.బాషా, అబ్దుల్లా, ఖాదర్, వీరన్న, నన్నా, సుగుణ పాల్గొన్నారు.

విద్యార్థినిపై కుక్కల దాడి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని నమాజ్ కట్ట వీధిలో బుధవారం కుక్కల దాడిలో ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఐదో తరగతి చదువుతున్న హేమాంజలి ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడడంతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అధికమైందని, వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటికి రావాలంటే భయాందోళనలకు గురవుతున్నారని, కుక్కల బెడదను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో 50 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, స్టేట్ రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ కాపు రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, ట్రెజరర్ మల్లికార్జున, మీనాక్షమ్మ, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రవికాంత్‌రమణ, ఎంసి మెంబర్స్ డా. జనార్దన్‌రెడ్డి, ఆలంబన జనార్దన్, హాస్టల్ వార్డెన్ గిరిజమ్మ పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని వాటిని చేరుకునేలా కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాపు రామచంద్రారెడ్డి